క్లుప్తంగా

బొల్లి వ్యాధిపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, వైద్య విద్యార్థులు

కర్నూలు(హాస్పిటల్): నగర శివారులోని పెంచికలపాడులో ఉన్న విశ్వభారతి మెడికల్ కాలేజీ ఆధ్వర్యంలో మంగళవారం బొల్లి వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చర్మవ్యాధి విభాగాధిపతి డాక్టర్ బి. ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ బొల్లి వ్యాధి లక్షణాలు, నివారణ పద్ధతులు, చికిత్స గురించి అవగాహన కల్పించారు. ప్రజలు ప్రతి ఒక్కరూ ఈ వ్యాధిపై అవగాహన పెంచుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వైద్యులు, వైద్య విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థినీ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

తక్షణమే రైతులకు పెట్టుబడి సాయం అందించాలి



డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న ఏపీ రైతుసంఘం నాయకులు

కర్నూలు(సెంట్రల్): కొత్త ప్రభుత్వం తక్షణమే రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం రూ.20 వేలను జమ చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. చంద్రబాబునాయుడు తన ఎన్నికల హామీని నెరవేర్చాలన్నారు. మంగళవారం రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ రైతుసంఘం ఆధ్వర్యంలో డీఆర్వో కె.మధుసూదన్‌రావుకు వినతిపత్రం అందించారు. 2023 ఖరీఫ్, రబీ సీజన్లలో పంటలు నష్టపోయిన అన్నదాతలకు వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీని అందజేయాలన్నారు. ఖరీఫ్‌కు సంబంధించి గత ప్రభుత్వం విడుదల చేసిన నిధులను నిలుపుదల చేయడం అన్యాయమన్నారు. వెంటనే రబీ పంట నష్ట పరిహారాన్ని కూడా అందజేయాలన్నారు. అంతేకాక రైతులకు సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు ఇవ్వాలన్నారు.

నీట్ కుంభకోణం సిగ్గుచేటు

కర్నూలు(సెంట్రల్): ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలనలో వైద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ పరీక్షలో పెద్ద ఎత్తున అక్రమాలు, అవకతవకలు జరగడం సిగ్గుచేటని సీపీఐ(ఎంఎల్)మాస్ లైన్ రాష్ట్ర సంఘం సభ్యుడు సూర్యం పేర్కొన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ..ఎన్డీఏ ప్రభుత్వం లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ స్కామ్‌ల అక్రమాలు జరిగాయని విద్యాశాఖమంత్రి ధర్మేంద్రప్రధాన్ ఒప్పుకున్నారు తప్పా విచారణ జరిపిస్తామని చెప్పలేదన్నారు. దీనిని బట్టి చూస్తే కుంభకోణంపై బీజేపీ నాయకులకు ఎంత చులకన భావన ఉందో అర్థమవుతుందన్నారు. వెంటనే నేషనల్ టెస్టు ఏజెన్సీని రద్దు చేసి నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు తిరుపాల్, అర్లప్ప, రాజేష్, రాజు, రమేష్ పాల్గొన్నారు.

28న జాబ్ మేళా

కర్నూలు సిటీ: నగర శివారులోని బి.తాండ్రపాడు దగ్గర ఉన్న ప్రభుత్వ ఐటీఐ(బాలిక)కాలేజీలో ఈ నెల 28వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఆ కాలేజీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఆర్.కృష్ణ మోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 ఏళ్ల నుంచి 32 ఏళ్ల వయస్సు కలిగి, ఎస్ఎస్‌సీ, ఐటీఐలో ఉత్తీర్ణులైన వారు మేళాకు హాజరుకావొచ్చునన్నారు. ఆసక్తి ఉన్న వారు బయోడేటా, విద్యార్హత మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రం, నాలుగు పాస్‌పోర్ట్, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ ఖాతా పుస్తకం, పాన్ కార్డులను వెంట తెచ్చుకోవాలన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.12,500 నుంచి రూ.16 వేలు వేతనం, వసతి, భోజనం సబ్సిడీలో కల్పించడం జరుగుతుందన్నారు.

స్టేడియంలో వాకర్ మృతి



మృతిచెందిన వాకర్ రామసుబ్బయ్య

కర్నూలు(టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో నాయకంటి రామసుబ్బయ్య అనే వృద్ధుడు వాకింగ్ చేస్తూ మృతిచెందాడు. ఈయన ప్రతి రోజు ఉదయం స్టేడియానికి వస్తాడు. ఎప్పటిలాగే మంగళవారం ఉదయం వచ్చిన ఆయన వాకింగ్ చేస్తూ స్టేడియం మెట్ల వద్ద కుప్పకూలి పడిపోయాడు. స్థానికులు వెంటనే స్టేడియంలోని డీఎస్‌డీఓ చాంబర్ వద్దకు తీసుకెళ్లి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే ఆయన మృతిచెందినట్లు క్యాజువాలిటీ వైద్యులు తెలిపారు.

సాక్షిగణపతికి ప్రత్యేక పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై సంకటహర చవితిని పురస్కరించుకుని బుధవారం సాక్షిగణపతి స్వామికి అభిషేకం, విశేషపూజలు నిర్వహించారు. స్వామికి పంచామృతాలతోను, ఫలోదకాలతోను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలంతో అభిషేకం చేసి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు.

వలంటీర్ సేవలకు మంగళం!

తాము అధికారంలోకి వస్తే వలంటీర్ వ్యవస్థను కొనసాగించడంతో పాటు గౌరవ వేతనం రూ. 5 వేల నుంచి రూ. 10 వేలకు పెంచుతామని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు స్పష్టమైన హామీ ఇచ్చారు. ఆ పార్టీ మేనిఫెస్టోలోనూ దీనిని పొందుపరిచారు. అయితే, అధికారంలోకి వచ్చిన తర్వాత బాబు వలంటీర్ల ఊసు ఎత్తకపోగా వారిని విధులకు దూరంగా ఉంచారు. తాజాగా గత ప్రభుత్వం ఇస్తున్న పేపర్ బిల్లు భత్యం నిలుపుదల చేయడంతో పాటు పెన్షన్ల పంపిణీ బాధ్యతను కూడా సచివాలయ ఉద్యోగులకే అప్పగించడంతో వలంటీర్ వ్యవస్థ కొనసాగింపుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.





ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడికి పింఛన్ సొమ్ము అందజేస్తున్న వలంటీర్ (ఫైల్), నగరపాలక కార్యాలయం

- ఇప్పటికే పేపర్ బిల్లు భత్యం రూ.200 నిలుపుదల
- పెన్షన్ పంపిణీ బాధ్యతలు దూరం
- జూలై 1 నుంచి సచివాలయ ఉద్యోగులతో పంపిణీ
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- రోడ్డున పడనున్న 2,160 మంది వలంటీర్లు

కర్నూలు (టౌన్) : ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. దీనికి అనుబంధంగా వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చింది. ఈవ్యవస్థ ద్వారా ప్రజలకు వారి ఇళ్ల వద్దే అవసరమైన సేవలు అందేలా చర్యలు తీసుకుంది. కర్నూలు కార్పొరేషన్ పరిధిలో 150 ఇళ్లకు ఓ వలంటీర్‌ను అధికారులు ఏర్పాటు చేశారు. వీరు గత ఐదేళ్లు ప్రభుత్వ పథకాలు, సేవలను కేటాయించిన ఇళ్లకు వెళ్లి అందించారు. ప్రతి నెల 1 వ తేదీ ఉదయాన్నే వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు ఇళ్లకు వెళ్లి పింఛన్ పంచి వారి మన్ననలు పొందారు. అయితే, ఈ వ్యవస్థను ఆది నుంచి వ్యతిరేకిస్తూ వచ్చిన తెలుగుదేశం పార్టీ ఎన్నికల ముందు ఓట్ల కోసం ప్లేటు ఫిరాయించింది. చంద్రబాబు నాయుడు ప్రతి ఎన్నికల సభలోనూ వలంటీర్లను కొనసాగిస్తామని, అధికారంలోకి రాగానే గౌరవవేతనం రెండింతలు చేస్తామని ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత బాబు సర్కారు వారిని పట్టించుకోవడం లేదు. ఇప్పుడు వారిని ఏకంగా విధులకు దూరం చేసి ఇళ్లకు సాగనంపేందుకు యత్నిస్తోంది.

పేపర్ భత్యం లేదు..

పెన్షన్ పంపిణీ బాధ్యతలు లేవు

నగరపాలక సంస్థ పరిధిలో 52 వార్డుల్లో 137 సచివాలయాలు ఉన్నాయి. ఈ సచివాలయాల్లో 2,160 మంది వలంటీర్లు ప్రజలకు సేవలు అందిస్తున్నారు. ప్రభుత్వం మారినా... మిమ్మల్ని కొనసాగిస్తామని చెప్పిన నాయకుల స్వరంలో మార్పు స్పష్టంగా కనిపిస్తుంది. తొలి నుంచి ఉన్న వలంటీర్లను పక్కన పెట్టి తెలుగు తమ్ముళ్లను నియమించుకునే దిశగా అడుగులు పడుతున్నాయి. ఇందులో భాగంగానే పేపర్ కొనుగోలుకు నాటి ప్రభుత్వం ఇస్తున్న రూ.200 భత్యంను రద్దు చేయడంతో పాటు 2019 నుంచి ప్రతి నెల 1 వ తేదీన పంపిణీ చేస్తున్న పెన్షన్ బాధ్యతల నుంచి కూడా వారిని తప్పించింది. ఈ చర్యలన్నీ తమను దూరం చేయడానికేనని వలంటీర్లు ఆందోళన చెందుతున్నారు.

1 నుంచి సచివాలయాల ఉద్యోగులతో పెన్షన్

వచ్చే నెల 1 వ తేదీ నుంచి నగరంలోని సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగులు పెన్షన్లు పంపిణీ చేస్తారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నగరంలోని 137 సచివాలయాల్లో 32,600 మంది పెన్షన్ లబ్ధిదారులు ఉన్నారు. పెన్షన్ పంపిణీ బాధ్యతల నుంచి ప్రభు త్వం వలంటీర్లను తప్పించడంతో జూలై 1 నుంచి తమకు సకాలంలో పెన్షన్ అందుతుందోలేదోనని అవ్వాతాతలు, దివ్యాంగులు ఆందోళనకు గురవుతున్నారు.

ఉద్యోగుల ద్వారా పింఛన్



నగరపాలకలో గతంలో పనిచేసిన వలంటీర్లందరికీ కొనసాగించాలన్న నిర్దిష్టమైన ఉత్తర్వులు రాలేదు. కొనసాగిస్తారా.. తొలగిస్తారా అన్నది ఇంకా తెలియరాలేదు. అయితే, పెన్షన్ల పంపిణీ మాత్రం సచివాలయాల ఉద్యోగులతో నిర్వహించాలని ఆదేశాలు వచ్చాయి.

– రామలింగేశ్వర్, ఇన్‌చార్జ్ కమిషనర్, నగరపాలక

న్యాయం చేయాలి



ఐదేళ్లు ప్రభుత్వం అమలు చేసిన ప్రతి సంక్షేమాన్ని అర్హులైన వారికి అందజేశాం. తక్కువ వేతనం ఉన్నా సేవా దృక్పథంతో పనిచేశాం. ప్రస్తుత ప్రభుత్వం రూ.10 వేలు ఇచ్చి కొనసాగిస్తామని ఎన్నికల ముందు చెప్పింది. ఇప్పుడు తొలగిస్తారంటున్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి మమ్మల్ని పక్కన పెట్టారు. రెండున్నర నెలలు అవుతుంది. ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలి.

– కె. మనోహర్,వలంటీర్, 65 సచివాలయం

వ్యాధులు ప్రబలకుండా చూడండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ నరసింహానాయుడు

కర్నూలు సిటీ: గ్రామాల్లో కలుషిత నీరు, పారిశుద్ధ్య లోపంతో అతిసార వంటి వ్యాధులు ప్రబల కుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ నరసింహా నాయుడు అధికారులకు ఆదేశించారు. మంగళవారం కర్నూలు మండల పరిషత్ కార్యాలయంలో వైద్యారోగ్య, గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్యం, స్త్రీ శిశు సంక్షేమ, విద్య, తదితర శాఖల అధికారులతో సీజనల్ వ్యాధుల నివారణ చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో తాగు నీరు కలుషితం కాకుండా నీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలన్నారు.అలాగే పారిశుద్ధ్యం లోపించకుండా చూడాలన్రాను. ప్రధానంగా డ్రైనేజీ కాలువల్లో పూడిక తొలగించాలన్నారు. ఈ.తాండ్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ విజయ మాధురి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ రంగస్వామి, మెడికల్ సబ్ యూనిట్ అధికారి కృష్ణ మోహన్ తదితరులు మాట్లాడారు. సమావేశంలో ఎంఈఓ వినోద్ కుమార్, ఆరోగ్య విస్తరణ అధికారులు మక్బుల్, రమణ, పీహెచ్‌ఎన్ నిర్మలా దేవి, సూపర్ వైజర్లు దానమ్మ, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు, పంచాయతీ కార్యదర్శులు, ఎంఎల్‌హెచ్‌పీ/సీహెచ్‌ఓలు, ఏఎన్‌ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): సీజనల్ వ్యాధులు ప్రబలే వేళ వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం చిన్నపిల్లలకు సంబంధించిన కేసుల గురించి సంబంధిత విభాగం వైద్యులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిన్నపిల్లలకు సీజనల్ వ్యాధులు ప్రబలితే అవసరమైన పడకలు, మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పీడియాట్రిక్ కేసుల కోసం పది పడకలు, పీడియాట్రిక్ ఐసీయూను సిద్ధంగా ఉంచాలన్నారు. వార్డుకు అవసరమైన వైద్యులు, హౌస్‌సర్జన్లు, పీజీలు, సిబ్బందిని నియమించుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులకు అనుగుణంగా మెయిన్ స్టోర్‌లో మందులు అందుబాటులో ఉన్నాయో లేదో తనిఖీ చేయాలని ఫార్మాసి సూపర్‌వైజర్‌ను ఆదేశించారు. ల్యాబ్ రిపోర్టులు వెంటనే జారీ చేయాలని చెప్పారు. కేసులు అవసరాన్ని బట్టి నెఫ్రాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ మొదలైన స్పెషలిస్టు వైద్యులను పిలుచుకోవాలని హెచ్‌ఓడీకి సూచించారు. పీడియాట్రిక్ కేసుల వ్యాప్తిపై రోజువారీ డేటాను సూపరింటెండెంట్ దృష్టికి తీసుకురావాలన్నారు. వైద్యులు, సహాయ సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉండాలని, అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి. వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ హేమనళిని, పీడియాట్రిక్ హెచ్‌ఓడీ డాక్టర్ విజయ్ ఆనంద బాబు, ప్రొఫెసర్ డాక్టర్ శారద, డాక్టర్ సుహాసిని, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. మల్లికార్జున, డాక్టర్ ఎం. ప్రకాష్‌కుమార్, డాక్టర్ ఎస్. శ్రీలత, డాక్టర్ పి. రవీంద్రరెడ్డి, ఏఆర్ఎంవో డాక్టర్ వెంకటరమణ, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయి, ఫార్మసిస్ట్ గ్రేడ్ వన్ ఐ. నరసింహరావు, శర్మ పాల్గొన్నారు.

ఓపీ కౌంటర్ల పెంపుతో సత్వర చికిత్స

కర్నూలు(హాస్పిటల్): ఆసుపత్రిలో ఓపీ కౌంటర్లు, డిజిటల్ కౌంటర్లు పెంచడం వల్ల రోగులకు సత్వరం చికిత్స అందుతోందని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో ఆరోగ్యశ్రీ, ఈ-హాస్పిటల్ అమలుపై అన్ని విభాగాల హెచ్‌ఓడీలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. అన్ని విభాగాల్లో ఆరోగ్యశ్రీ లక్ష్యాలు చేరుకోవడంతో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న తరుణంలో ప్రతి ఒక్కరూ అందుబాటులో ఉండే విధంగా హెచ్‌ఓడీలు చర్యలు తీసుకోవాలన్నారు. ఎమర్జెన్సీ మెడిసిన్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన సేవలు సైతం త్వరలో అందుబాటులోకి రానున్నాయన్నారు. క్యాజువాలిటీ విస్తరణలో భాగంగా ఎమర్జెన్సీ విభాగానికి రెండు గదులు కేటాయిస్తున్నామన్నారు. ప్రస్తుతం ఉన్న ఏఎంసీలో పడకల కొరత కారణంగా ఓల్డ్ బ్లడ్‌బ్యాంక్‌లో మరో 12 పడకలతో ఏఎంసీ పొడిగింపు, తదనుగుణంగా అవసరమైన సివిల్, ఎలక్ట్రికల్ పనులు జరుగుతున్నాయన్నారు. సమావేశంలో సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి. వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ హేమనళిని, ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సమసమాజ స్థాపనకు పాటుపడాలి

- సీపీఎం కార్యకర్తలకు పిలుపునిచ్చిన మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఏ గఫూర్

కర్నూలు(సెంట్రల్): సమ సమాజ స్థాపన కోసం సీపీఎం కార్యకర్తలు కంకణబద్ధులై పనిచేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్ పిలుపు నిచ్చారు. మంగళవారం కార్మిక కర్షక భవన్‌లో జరుగుతున్న మూడో రోజు సీపీఎం జిల్లా మహాసభలకు ఆయనతో పాటు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.ప్రభాకరరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మారుతున్నా ప్రజల సమస్యలు మాత్రం తీరడంలేదన్నారు. నూతన టెక్నాలజీ ఎంతో అభివృద్ధి చెందుతున్న పేద ప్రజలకు మంచి వైద్య సదుపాయాలు అందుబాటులోకి రావడంలేదన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం మనిషి సగటు జీవిత కాలం 67.24 ఏళ్లుగా ఉండడం బాధాకరమన్నారు. దేశంలో అసంఘటిత రంగంలోని కార్మికులు ఆకలితో అలమటిస్తుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంపై పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో ఎండీ ఆనందు, టి.రాముడు, ఎం.రాజశేఖర్ పాల్గొన్నారు.

శ్రీశైల క్షేత్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్రాన్ని అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి తెలిపారు. మంగళవారం దేవస్థాన పరిపాలన భవనంలోని సమీక్షా సమావేశ మందిరంలో దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు, అన్ని యూనిట్ విభాగాల అధికారులు, పర్యవేక్షకులు, సిబ్బందితో ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా ఈఓ దేవస్థాన కార్యకలాపాలను వివరించారు. సాధారణ, వారంతపు, పర్వదినాలలో భక్తుల రద్దీ, భక్తులకు కల్పించబడుతున్న వసతి, దర్శన ఏర్పాట్లు మొదలైన అంశాలను ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్తుల రద్దీకి అనుగుణంగా క్షేత్రంలో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. శ్రీశైల క్షేత్ర అభివృద్ధి గురించి ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేక దృష్టి ఉందని, తదనుగుణంగా క్షేత్రాన్ని అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. అనంతరం ఎమ్మెల్యే అన్నదాన భవనాన్ని పరిశీలించారు. సమావేశంలో దేవస్థాన సహాయ కమిషనర్, డిప్యూటీ కార్యనిర్వహణాధికారి రవణమ్మ పాల్గొన్నారు.

గురుకులంలో మిగిలిన సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లా అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు మిగిలిన సీట్ల భర్తీ కోసం ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణమూర్తి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 28వ తేదీ సాయంత్రం లోగా విద్యార్థి ఆధార్, కుల ధ్రువీకరణ పత్రం, రెండు పాసు ఫొటోలు జూపాడుబంగ్లా గురుకుల పాఠశాలలో ఇచ్చి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. పేర్లు నమోదు చేయించుకున్న విద్యార్థులకు 29వ తేదీ ఉదయం ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రవేశపరీక్షకు హాజరై అత్యధికమార్కులు సాధించిన విద్యార్థులకు తరగతుల వారీగా మిగిలిన సీట్లను భర్తీచేస్తానన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

స్పోర్ట్స్

హాకీ క్రీడాభివృద్ధికి తోడ్పాటు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రెండో పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా

కర్నూలు (టౌన్): హాకీ క్రీడాభివృద్ధికి తన వంతు తోడ్పాటు అందిస్తానని రెండో పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా అన్నారు. స్థానిక మున్సిపల్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హాకీ వేసవి కాల శిక్షణ ముగింపు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రీడల్లో పాల్గొనాలన్నారు. హాకీ శిక్షణలో నేర్చుకున్న మెళకువలను ప్రతి రోజు కొంత సేపు సాధన చేయాలన్నారు. తద్వారా జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించే అవకాశం ఉంటుందన్నారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు మాట్లాడుతూ కర్నూలులో ప్రత్యేకించి హాకీ క్రీడకు మంచి పేరు ఉందన్నారు. ఇక్కడ నుంచి క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదిగారన్నారు. హాకీ సంఘం కార్యదర్శి దాసరి సుధీర్, ఉపాధ్యక్షుడు ప్రవీణ్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో సత్తా చాటండి



జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే రగ్బీ క్రీడాకారులు

కర్నూలు (టౌన్) : ఈనెల 27, 28 తేదీల్లో మహారాష్ట్రలోని పూణేలో జరుగుతున్న జాతీయ స్థాయి రగ్బీ అండర్ -18 (జూనియర్స్) పోటీల్లో సత్తా చాటాలని రగ్బీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. రామాంజనేయులు అన్నారు. మంగళవారం స్థానిక బి.క్యాంపు క్రీడా మైదానంలో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటున్న రాష్ట్ర జట్టు క్రీడాకారులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల విశాఖపట్నంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో క్రీడాకారులు ప్రతిభ చాటి జాతీయ స్థాయికి ఎంపికయ్యాయన్నారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులను సహించం

- పోలీసులు కఠినంగా వ్యవహరించాలి
- కార్యకర్తలు అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం
- మాజీ ఎమ్మెల్యే కాటసాని



కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పాణ్యం: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై టీడీపీ చేస్తున్న దాడులను సహించేది లేదని.. ఇకనైనా తీరు మార్చుకోవాలని పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఎన్నికల్లో గెలుపొందిన రోజు నుంచి టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారని.. కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా ప్రజా ఆస్తుల విధ్వంసానికి పాల్పడుతున్నా పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరించడం దారుణమని తెలిపారు. వాటికి స్వస్తి చెప్పి ప్రజలకు ఇచ్చిన హామీలు, అభివృద్ధి పనులపై దృష్టి పెడితే మంచిదని హితవుపలికారు. పోలీసులు కఠినంగా వ్యవహరించాలన్నారు. ప్రజలకు మెరుగైన ఆరోగ్యం అందించేందుకు రూ.17.50 లక్షలతో ఆధునాతన భవనం నిర్మిస్తే వాటిపై ఉన్న శిలాఫలకాలను ధ్వంసం చేయడం సిగ్గు చేటన్నారు.

హామీలు అమలు చేయకుంటే కార్యాచరణ ప్రకటిస్తాం

ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చి టీడీపీ అధికారంలోకి వచ్చిందని.. హామీల అమలుకు ఐదు నెలలు వేచిచూస్తామని ఆ తర్వాత కార్యచరణ ప్రకటిస్తామని కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం పాణ్యంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి వచ్చినా హామీలపై ఇంత వరకు స్పష్టత ఇవ్వలేదన్నారు. వలంటీర్ వ్యవస్థపై ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. మోగా డీఎస్సీ అంటూ ఊదరగొట్టి తీరా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇచ్చిన 6 వేల పోస్టులను కలుపుకుని 16 వేలు నోటిఫికేషన్ అంటూ ప్రజలను దగా చేస్తోందని విమర్శించారు.

దాడులు..వికృత చేష్టలు

టీడీపీ అధికారంలోకి వచ్చిన రోజు నుంచి రాష్ట్రంలో ప్రభుత్వ భవనాలకు పేర్లు మార్చడం, శిలాఫలాకాలను ధ్వంసం చేయడం, వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులు, హత్యలకు పాల్పడుతోందని అన్నారు. తమ ప్రభుత్వంలో ఎప్పుడూ ఇలా జరగలేదన్నారు. ఐదేళ్లలో కరోనాతో రెండేళ్లు పోను మూడేళ్ల ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చామని తెలిపారు. సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్ సెంటర్లు, డిజిటల్ లైబ్రరీలు, పాఠశాలలు, 108,104, పశుసంచార ఆరోగ్య వాహనాలు, సీసీరోడ్లు తదితర అభివృద్ధి పనులు చేసి చూపామన్నారు. టీడీపీ నాయకులు చేతనైతే అభివృద్ధి చేసి ప్రజల మన్ననలు పొందాలన్నారు.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం

నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని తెలిపారు. ఎవరూ అధైర్య పడొద్దని.. మంచి రోజులు వస్తాయని భరోసా ఇచ్చారు. ఎవరికైనా ఇబ్బందులు ఎదురైతే తనకు సమాచారం ఇవ్వాలని కోరారు. కవ్వింపు చర్యలకు పాల్పడినా, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా తక్షణమే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, నాయకులు శేషిరెడ్డి, శేషయ్య, రామకిట్టు, హోటల్‌శ్రీను, కరుణాకర్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శివారెడ్డి, రవిరెడ్డి పాల్గొన్నారు.

బయటపడిన వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహం

మహానంది: బుక్కాపురంలోని శ్రీ మారెమ్మ దేవస్థానం వద్ద ఆలయ పదహారు రోజుల పండుగ నిర్వహిస్తుండగా భూమిలో బ్రహ్మంగారి విగ్రహం ఉందని వెంకటసుబ్బమ్మ అనే మహిళ చెప్పగా.. గుంతను తీస్తే విగ్రహం బయటపడినట్లు స్థానికులు తెలిపారు. అయితే ఇది పురాతనమైన విగ్రహం కాదని, చూస్తే విగ్రహం కొత్తగానే ఉందని పలువురు చర్చించుకుంటున్నారు.

వైభవంగా జయతీర్థుల మహితోత్సవం



అశేష జనావాహిని మధ్య జయతీర్థుల రథోత్సవం

మంత్రాలయం: మధ్వమత పూర్వపు పీఠాధిపతి జయతీర్థుల మహితోత్సవం వేడుకలు వైభవంగా జరిగాయి. మంగళవారం శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల నేతృత్వంలో మహితోత్సవం వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. కర్ణాటకలోని నవ బృందావన క్షేత్రంలో బృందావనస్థులైన పద్మనాభతీర్థుల మూల బృందావనానికి జయతీర్థులు శ్రీమన్యాయసుధా గ్రంథాన్ని సమర్పించిన దినాన్ని పురస్కరించుకుని జయతీర్థుల మహితోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా మంగళవారం జయతీర్థుల చిత్రపటానికి ఊంజల మండపంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం బంగారు రథంపై జయతీర్థుల చిత్రపటాన్ని ఉంచి అంగరంగ వైభవంగా ఊరేగించారు. శ్రీమఠం ప్రాంగణంలో రథోత్సవం కనుల పండువగా సాగింది. అనంతరం ఊంజల మండపం వేదికపై పీఠాధిపతి ప్రవచనాలు గావించారు. జయతీర్థుల మహితోత్సవం విశిష్టతను భక్తులకు వివరించారు.